జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా అభిషేక్



అభిషేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాయదుర్గం: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా రాయదుర్గానికి చెందిన ఏ.అభిషేక్ నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అభిషేక్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లా వ్యాప్తంగానే కాకుండా ప్రత్యేకంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం, గచ్చిబౌలి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని నర్సింహారెడ్డి సూచించారు. అనంతరం అభిషేక్‌ను ఆయన అభినందించారు. ఆ తర్వాత రాయదుర్గానికి చేరుకున్న అభిషేక్‌ను పలువురు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

శేరిలింగంపల్లి: పాపిరెడ్డి కాలనీలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి కాలనీ అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి, నాయకులు రాజుయాదవ్, గణేష్‌ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, మల్లేష్‌యాదవ్, మల్లేష్‌గౌడ్, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు డీఎస్పీగా ప్రభాకర్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నూతన డీఎస్పీగా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ చీఫ్ ఆఫీస్ డీజీ కంట్రోల్‌రూమ్‌లో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ పటాన్‌చెరు డీఎస్పీగా బదిలీపై వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన డీఎస్పీ రవీందర్‌రెడ్డి హైదరాబాద్ డీజీపీ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ...ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో ముందుంటామని తెలిపారు. మహిళల భద్రత కోసం బస్టాండ్‌లో, విద్యాసంస్థలు వద్ద షీ టీమ్స్ పనిచేస్తున్నాయన్నారు. బదిలీపై వెళ్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి పదవీ బాధ్యతలను డీఎస్పీ ప్రభాకర్‌కు అప్పగించారు.

ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు గ్రహణం

- రూ.450 కోట్ల విలువైన స్థలానికి రక్షణ కరువు
- కాంప్లెక్స్‌లో ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు తిష్ట
- స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఉనికికి పొంచి ఉన్న ప్రమాదం
- మరో వైపు చెత్త సేకరణ పాయింట్
- దశాబ్దం దాటినా ప్రారంభానికి నోచుకోని ఇండోర్ స్టేడియం

గచ్చిబౌలి: ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు గ్రహణం వీడటం లేదు. కోవిడ్ సమయంలో ఫ్లై ఓవర్ల నిర్మాణం కోసం సిమెంట్ గ్రిడ్‌లను తయారు చేసుకునేందుకు ఓ ప్రైవేట్ సంస్థకు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అవకాశం కల్పించారు. ఏళ్లు గడుస్తున్నా సదరు సంస్థ అక్కడే తిష్ట వేసింది. మరో వైపు లేబర్ క్యాంప్ అక్కడే కొనసాగుతోంది. ఇంకో వైపు ప్రైవేట్ వ్యక్తులు క్రికెట్ ప్రాక్టీస్ కోసం నెట్ కోర్టును ఏర్పాటు చేశారు. మరో వైపు జీహెచ్‌ఎంసీ చెత్త సేకరణ పాయింట్ ఏర్పాటు చేయడంతో దుర్గంధంగా మారింది. ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌పై ముప్పేట దాడి జరుగుతుండటంతో తన ఉనికినే కోల్పోయే ప్రమాదంలో పడింది. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వీర్యమవుతోంది.

ప్రారంభానికి నోచుకోని ఇండోర్ స్టేడియం..

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మినీ స్టేడియం కోసం రూ.6 కోట్లు అంచనా వ్యయంగా ప్రతిపాదించారు. మొదటగా ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం రూ.3 కోట్లు కేటాయించారు. శంకుస్థాపన అయిన రెండేళ్లకు పనులు ప్రారంభమై మధ్యలోనే నిలిచిపోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇండోర్ స్టేడియంపై దృష్టి సారించారు. రెండేళ్లకు పూర్తి కావాల్సిన పనులు 2018లో పూర్తయ్యాయి. జీహెచ్‌ఎంసీ గ్రీనరీ పనుల కోసం రూ.11 లక్షలు కేటాయించింది. ఏడేళ్లనా ఇండోర్ స్టేడియం ప్రారంభానికి నోచుకోలేదు. కిటికీలు ధ్వంసమై కళావిహీనంగా మారింది. 2700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో నాలుగు బ్యాడ్మింటన్ కోర్టులు, చెస్, క్యారమ్స్, మినీ జిమ్, ఇతర సౌకర్యాలతో కూడిన భవనాన్ని, బ్యాడ్మింటన్ కోర్టులను నిర్మించారు.

ప్రైవేట్ సంస్థ తిష్ట..

కోవిడ్ సమయంలో ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టిన ఓ ప్రైవేట్ సంస్థ సిమెంట్ గ్రిడ్‌ల తయారీ కేంద్రాన్ని ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసింది. గచ్చిబౌలి డివిజన్‌లో అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలు ఉన్నా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయడం అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. లేబర్ క్యాంప్‌ను కూడా అక్కడే ఏర్పాటు చేసింది. ఏళ్లు గడుస్తున్నా దాదాపు సగం స్థలంలో సదరు కంపెనీ తిష్టవేయడంలో మతలబు ఏమిటో అర్థం కావడంలేదు.

క్రికెట్ ప్రాక్టీస్ కోర్టు..

ప్రైవేట్ వ్యక్తులు ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రికెట్ ప్రాక్టీస్ కోసం నెట్ కోర్టును ఏర్పాటు చేశారు. క్రికెట్ ప్రాక్టీస్ చేసే వారి నుంచి నెలసరి ఫీజులు వసూలు చేస్తున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలంలో ప్రైవేట్ వ్యక్తుల జులుం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌పై మూడు వైపుల నుంచి ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలానే చూసి చూడనట్లు వ్యవహరిస్తే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఉనికికి ప్రమాదం పొంచి ఉందని క్రీడాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇండోర్ స్టేడియాన్ని ఆనుకొని చెత్త సేకరణ పాయింట్



పగిలిన ఇండోర్ స్టేడియం కిటికీ



ప్రారంభానికి నోచుకోని ఖాజాగూడలోని ఇండోర్ స్టేడియం



ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలంలో ప్రైవేట్ సంస్థ లేబర్ క్యాంప్

చెత్త కంపు..

ఇండోర్ స్టేడియానికి అతి సమీపంలో చెత్త సేకరణ, రవాణా పాయింట్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. నిత్యం చెత్త తరలించినప్పటికీ కొంత చెత్త అలానే పేరుకుపోవడంతో కంపుకొడుతోంది. గోపన్‌పల్లి ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కేటాయించిన స్థలంలో చెత్త సేకరణ పాయింట్ ఏర్పాటు చేయడం సబబుగా లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలం తాగుబోతులకు అడ్డాగా మారింది. ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలానికి రక్షణ కరువు..

క్రీడలకు పెద్దపీట వేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించింది. రాష్ట్రంలో క్రీడలకు మౌలిక వసతులు కల్పించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తోంది. ఖాజాగూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కేటాయించిన స్థలం విలువ రూ.450 కోట్లకు పైగానే ఉంటుంది. స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలం ఖాజాగూడలో వంద అడుగుల రోడ్డును ఆనుకొని ఉంటోంది. అత్యంత విలువైన స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని క్రీడాభిమానులు ప్రశ్నిస్తున్నారు.

ఆక్సిజన్ పార్కుకు క్రీడా పరికరాలు అందజేత



క్రీడా పరికరాలను ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీ ఆక్సిజన్ పార్కుకు క్రీడా పరికరాలు అందజేయడం అభినందనీయమని పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. హుడా కాలనీలో నివసించే జి.శ్రీనివాసరావు దంపతులు మనవడు రిషన్ జన్మదినం సందర్భంగా పార్కులో ఆట వస్తువులను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మణ్, రాజేందర్ పాల్గొన్నారు.

చెత్త కుప్పలను తొలగించండి

చందానగర్: చందానగర్ ఎంఎంటీఎస్ స్టేషన్ వెనకాల హుడా కాలనీ ముందు పైప్‌లైన్ రోడ్డులో రోడ్డంతా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. నిత్యం రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు చెత్తను ప్లాస్టిక్ కవర్లలో తీసుకువచ్చి వేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తుందని, చందానగర్ సర్కిల్ పారిశుద్ధ్య అధికారులు, కార్మికులు వెంటనే రోడ్డుపై ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



చందానగర్ ఎంఎంటీఎస్ స్టేషన్ వెనకాల పైప్‌లైన్ రోడ్డు పక్కన చెత్త కుప్పలు

గురుకుల విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర/బాలికల కళాశాలల్లో చదువుకొని ఉద్యోగం పొందలేని వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారని గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ కల్పన మంగళవారం తెలిపారు. 2017 నుంచి గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర/బాలికల రెండు గురుకుల కళాశాలల్లో చదువుకొని ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం రాని వారు ఉంటే వారికి ప్రత్యేకంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకోసం ప్రభుత్వ చొరవతో ఉన్నతి ఫౌండేషన్ ముందుకొచ్చి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోందని ఆమె గుర్తు చేశారు. 19 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన గురుకుల పూర్వ విద్యార్థులకు రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు గౌలిదొడ్డి కళాశాలలో వెంటనే శిక్షణ కోసం దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కుట్టు మిషన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఇందిరమ్మ మైనార్టీ, మహిళా శక్తి పథకం, రేవంతన్న భరోసా కార్యక్రమంలో భాగంగా మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ద్వారా 200 మంది మైనార్టీ మహిళలకు కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, రాగం నాగేందర్‌యాదవ్, నార్నె శ్రీనివాస్‌రావు, మంజుల రఘునాథ్‌రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్‌కుమార్ రెడ్డితో కలిసి కుట్టుమిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళలు స్వయం ఉపాధి కల్పన, ఆర్థికస్వాలంబనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టు మిషన్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ రీజినల్ అధికారి కులకర్ణి, ఏజీఎం పసారి, షాజీయాబేగం, నజీయాబేగం, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.